APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక :82 | పేజీలు : 04 వెల రూ. 2/- | మంగళవారం 19-05-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 82 | PAGES : 04 PRICE : 2 | TUESDAY, 19 MAY 2026

Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |



విలేకరులు కావలెను

స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు

కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.

స్ఫూర్తి పత్రిక Voice of Truth

గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.

ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.

ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.


# భారత్,నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

- ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య అనేక ఒప్పందాలు కుదిరాయ్: ప్రధాని మోదీ
- అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.
- వివిధ రంగాల్లో పరిశోధనల కోసం నార్వే నుంచి మేము సాయం తీసుకుంటాం
- ఇస్రో, నార్వే స్పేస్ ఏజెన్సీల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి.
- నార్వే నుంచి సాంకేతికత, పెట్టుబడులు భారత్ కు వస్తున్నాయి.

**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా- భారత్‌కు నార్వే అండగా నిలిచింది: ప్రధాని మోదీ**




**ఢిల్లీ :** అత్యంత క్లిష్టసమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, భారతదేశానికి, నార్వే అండగా నిలిచి, తన నిజమైన స్నేహాన్ని చాటుకుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. సోమవారం నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన తరువాత, ప్రధాని మోదీ పలు కీలక అంశాలపై మాట్లాడారు. సైనిక ఘర్షణల ద్వారా మాత్రమే శాశ్వత శాంతిని - మిగతా 2 లో

## కర్ణాటకలో రెండు ఏనుగుల భీకరపోరు.. పర్యాటకురాలి మృతి...

- కర్ణాటక దుబారే ఏనుగుల శిబిరంలో విషాదం
- రెండు ఏనుగుల మధ్య గొడవతో అనూహ్య ఘటన
- చెన్నైకి చెందిన మహిళా పర్యాటకురాలు దుర్మరణం
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఘటనపై అటవీశాఖ అధికారుల విచారణ

**ఢిల్లీ :** కర్ణాటకలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన దుబారే ఎలిఫెంట్ క్యాంప్ లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రెండు ఏనుగులు గొడవ పడుతున్న సమయంలో జరిగిన ప్రమాదంలో చెన్నైకి చెందిన ఓ మహిళా




## ఆలయ పూజారుల జీతాలపై పిల్.. విచారణకు సుప్రీంకోర్టు నో

- ప్రభుత్వ నియంత్రణలోని ఆలయ పూజారుల జీతభత్యాలపై దాఖలైన పిల్ తిరస్కరణ
- ఈ విషయంలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు ధర్మాసనం
- సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ అనుమతి
- పూజారులను ఉద్యోగులుగా గుర్తించాలని పిటిషన్‌లో అభ్యర్థన




# ఎన్నికల టీమ్‌కు కసరత్తు!?

- త్వరలో రాష్ట్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, విస్తరణ
- రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ముందు లేదా కాస్త వెనుక జరిగే అవకాశం
- ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియడంతో తెలంగాణపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి
- రాష్ట్ర నాయకత్వానికి గట్టి సంకేతాలు
- ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవుల భర్తీతో పాటు పనితీరు బాగాలేని వారికి ఉద్వాసన?
- పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పనితీరుపైనా బేరీజు
- పరిశీలనలో మహేశ్ కుమార్ గౌడ్, సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, బాలునాయక్‌ల పేర్లు




**హైదరాబాద్ :** హైదరాబాద్: ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియడంతో కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణలో త మ ప్రభుత్వం, పార్టీపై దృష్టి సారించినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వచ్చే నెల జూన్ 7 నాటికి సగం పదవీకాలం పూ ర్తికానుండడంతో వచ్చే ఎన్నికలలో తిరిగి అధికారం దక్కించుకునేందుకు ప్రభుత్వం, పార్టీలో చేర్పులు, మార్పులు చేసి ఎన్నికల టీమ్‌ను ఏర్పాటు చేసే దిశగా అధిష్టానం, ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర నాయకత్వం ఏకాభిప్రాయంతో ఉన్నట్టు ఈ వర్గాల సమాచారం. పై గా త్వరలో ఎంపిటిసి, జడిపిటిసి, జిల్లా పరిషత్ ఎన్నికలను కూడా ఎదుర్కొవాల్సి ఉండటంతో ఆ లోగా మంత్రిమండలిలో ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవు ల భర్తీతో పాటు పనితీరు బాగా లేని ఒకరిద్దరికి ఉద్వాసన పలికి సామాజిక సమీకరణల కు విఘాతం కలుగకుండా మంత్రివర్గ పునర్ వ్యవస్థీరకరణ చేసే దిశగా కూడా అధిష్టానం యోచిస్తోన్నట్టు సమాచారం. ఇప్పటి కే ఈ అంశంపై అధిష్టాన పెద్దలు - మిగతా 2 లో

## నిజామాబాద్ జిల్లాకు రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారు: ధర్మపురి అర్వింద్




- మహేశ్ గౌడ్‌ను అణగదొక్కాలనేది రేవంత్ కుట్ర అన్న అర్వింద్
- అందుకే నిజామాబాద్ జిల్లాను పట్టించుకోవడం లేదని ఆరోపణ
- కోమటిరెడ్డిని సీఎం చేయాలన్న అర్వింద్

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లాను పూర్తిగా విస్మరించి ప్రజలకు 'పంగనామాలు' పెట్టారని మండిపడ్డారు. ముఖ్యంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కాలనే కుట్రతోనే, ఆయన సొంత జిల్లా అయిన - మిగతా 2 లో




## త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్.. ఇక ప్రయాణం సుఖమయం

- హైదరాబాద్ మెట్రోకు 60 కొత్త కోచ్‌లు
- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ కీలక నిర్ణయం
- బెంగళూరు బీఈఎంఎల్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం
- 15 నెలల్లో కోచ్‌ల సరఫరాకు సంస్థ హామీ
- పెరగనున్న రైళ్ల ఫ్రీక్వెన్సీతో ప్రయాణికులకు ఊరట

## భారత్ లో... బట్టతలకు హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్న ఉగ్రవాది!




- గత నెలలో మహమ్మద్ ఉస్మాన్ జాట్, అబు హురెయిరాను అరెస్టు చేసిన పోలీసులు
- కశ్మీర్ వెలుపల స్లీపర్ సెల్స్‌ను ఏర్పాటు చేసే పనిని తమకు అప్పగించినట్లు వెల్లడి
- తనకు జుత్తు ఊడటంతో బట్టతల సమస్యతో బాధపడుతున్నట్లు చెప్పిన ఉస్మాన్

## రిక్షా తొక్కుతూ నిరసన వ్యక్తం చేసిన అంబటి రాంబాబు




- ఇంధన ధరల పెంపుపై నిరసన కార్యక్రమం చేపట్టిన అంబటి
- దేశంలో ఏపీలోనే అత్యధిక ఇంధన ధరలు ఉన్నాయని విమర్శ
- ప్రజల కష్టాలు వారికి పట్టడం లేదని ఆగ్రహం

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైసీపీ గుంటూరులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వ ర్యం లో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనలో అంబటి రాంబాబు స్వయంగా రిక్షా తొక్కుతూ వినూత్న రీతిలో తన నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ..- మిగతా 2 లో

## కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం.. సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం




- కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం
- పదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన యూడీఎఫ్ కూటమి
- రాజకీయ ప్రత్యర్థిగా భావించే రమేశ్ చెన్నితాలకు హోం శాఖ కేటాయించిన సీఎం
- తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమానికి రాహుల్ గాంధీ, ఖర్గే హాజరు

**కేరళ :** కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. త

# రాష్ట్రంలోని ఊపందుకున్న పలు ప్రాజెక్టులు

**'నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులు పూర్తికావాలి' - రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష**




- పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష
- నిర్దేశిత గడువుకు ప్రాజెక్టులు పూర్తికావాలని సీఎం దిశానిర్దేశం
- వాటర్ మేనేజ్‌మెంట్‌లో ప్రజల భాగస్వామ్యానికి చర్యలు చేపట్టాలన్న సీఎం చంద్రబాబు
- ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 18 నెలల్లోనే సాగునీటి రంగంపై ఏకంగా రూ.23,793 కోట్లు ఖర్చు
- రాయలసీమలోని జిల్లాలకు ఈ సంవత్సరం 43 టీఎంసీలకు పైగా జలాలను విడుదల
- రూ.900 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి

**అమరావతి,:** : పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇటీవల విడుదల చేసిన ఇరి గేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా నిర్దేశిత గడు వుకు ప్రాజెక్టులు పూర్తి కావాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. వాటర్ మేనేజ్మెంట్ లో సాగు నీటి సంఘాలతో పాటు ప్రజల భాగ స్వామ్యం కూడా తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

# సంపాదకీయం

## యుద్ధవేళ.. భారత్ ప్రయోజనాలే ముఖ్యం

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధం ఉధృతమవుతోంది. ఈ యుద్ధం వల్ల గల్ఫ్ దేశాలకు తీవ్ర నష్టాలు వాటిల్లుతున్నాయి. పశ్చిమాసియాను అతలాకుతలం చేస్తోన్న ఈ యుద్ధం అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంపైన అంతో ఇంతో ప్రతికూల ప్రభావం చూపుతోంది. అమెరికా విదేశాంగ విధానంలోని నిర్హేతుకతను ఈ యుద్ధం బహిర్గతం చేసింది. అమెరికా సామ్రాజ్యవాద దురహంకార వైఖరి మరోసారి ప్రపంచానికి తెలిసివచ్చింది. రష్యా, చైనాతో సహా అనేక దేశాలు గత పది రోజులుగా పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఒక వైపు ఇరాన్‌తోను, మరోవైపు గల్ఫ్ దేశాలు, అమెరికాతో ఉన్న సంబంధాలే ప్రస్తుత సందర్భంలో భారత్ దౌత్యనీతిని ప్రభావితం చేస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు ఉత్పన్నమైన ప్రతిసారీ భారత్ ఒక నైతిక సవాల్ నెదుర్కోవలసివస్తోంది. 1980 దశకంలో ఇరాన్ఇరాక్ యుద్ధంలో భారత్ తటస్థ పాత్ర పోషించినా, సద్దాం హుస్సేన్ వైపే సానుకూలత చూపింది. అయితే సద్దాం 1990 దశకం తొలినాళ్లలో కువైట్‌ను దురాక్రమించినప్పుడు మొదలైన గల్ఫ్ యుద్ధంలో ఇరాక్‌కు వ్యతిరేకంగా నిలబడింది. అందుకు దేశ ఆర్థిక ప్రయోజనాలే ముఖ్య కారణం. ఆ యుద్ధం సందర్భంగా ఇరాక్‌పై దాడులకు ఫిలిప్పీన్స్ నుంచి గల్ఫ్‌కు వెళ్లే అమెరికా యుద్ధ విమానాలకు భారత్‌లో ఇంధనం నింపడానికి నాటి ప్రధానమంత్రి చంద్రశేఖర్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనిపై పార్లమెంటు లోపల, బయట ఆ ప్రభుత్వంపై పెనుదుమారం చెలరేగింది. చమురు నిల్వలు దాదాపు అంతరించి దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా పతనమవుతున్న రోజులవి. బ్రిటన్, స్విట్జర్లాండ్‌కు 67 టన్నుల బంగారం తీసుకెళ్ళి తాకట్టు పెట్టి రుణం తీసుకోవలసినంత అగత్యమేర్పడిన సందర్భమది. చంద్రశేఖర్ ప్రభుత్వం అలీనోద్యమ విధానాలకు విరుద్ధంగా అమెరికాకు సహాయం చేయడాన్ని నాటి ప్రతిపక్ష నేత రాజీవ్‌గాంధీ తీవ్రంగా గర్హించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటును స్తంభింపజేసింది. ఈ పరిణామాల ఫలితంగా గల్ఫ్ దేశాల దౌత్యవేత్తలు రాజీవ్‌గాంధీని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడారు. అప్పటి ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా దేశ ఆర్థిక వ్యవస్థ నిజ పరిస్థితిని ప్రతిపక్షాలకు లోపాయికారీగా వెల్లడించి గల్ఫ్ దేశాలకు మద్దతుగా నిలవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కొన్ని వారాల తర్వాత కువైట్ నుంచి ఇరాక్ సేనలు వెనక్కి వెళ్లిపోయే సమయానికి అమెరికా విమానాలకు భారత్‌లో ఇంధనం నింపే వెసులుబాటును కేంద్రం విరమించింది. ఆ యుద్ధం రోజుల్లో గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్న భారతీయులు 20 లక్షల మంది దాకా ఉండేవారు. అప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థ దిగజారి బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందవల్సిన దుస్థితిలో ఉన్నది. నేడు భారత్ ఖజానాలో దాదాపు 750 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. అప్పుడైనా ఇప్పుడైనా దేశ ఆర్థిక ప్రయోజనాలే ప్రభుత్వానికి కీలకమైనవి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా గల్ఫ్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న సందర్భాలలో అవి దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే వ్యవహరించాయి. ఈ రోజు కోటి మంది భారతీయులు అమెరికా మిత్ర రాజ్యాలైన గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలుగా ఉన్నారంటే అందుకు 1991లో చంద్రశేఖర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ప్రధాన కారణమనడం సత్యదూరం కాదు. గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయులలో ఒంటెల కాపరులు మొదలు, వైద్యుల దాకా అనేక వృత్తులవారు ఉన్నారు. గల్ఫ్ దేశాలలో మన వాణిజ్య ప్రయోజనాలూ విశేషంగా ఉన్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి చమురు ఒక ప్రాథమిక అవసరం. తనకు అవసరమైన చమురులో దాదాపు 85 శాతాన్ని గల్ఫ్ దేశాల నుంచే భారత్ దిగుమతి చేసుకుంటోంది. రోడ్లపై వాహనాల నుంచి పంట పొలాలకు అవసరమైన యూరియా, వంటగదులలో వినియోగించే గ్యాస్, ఇతరత్రా అనేక పరిశ్రమలకు అవసరమైన సామగ్రి, రసాయానాలు ఈ చమురు నుంచే లభిస్తాయి. యుద్ధం ప్రారంభమైన వారం రోజులకే మన దేశంలోని రెస్టారెంట్లు ఆందోళన చెందుతున్నాయంటే గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతులు నిలిచిపోతే ఏర్పడే పరిస్థితిని ఊహించుకోవచ్చు. పీపా చమురు ధర ఒక డాలర్ చొప్పున పెరిగినా భారత్ అదనంగా రూ. 16 వేల కోట్లు నష్టపోతుంది. ఇది విస్మరించలేని వాస్తవం. ఐరోపా, అమెరికా, ఇంకా ఆఫ్రికా విమానయానానికి కూడా గల్ఫ్ దేశాల గగనతలం కీలకవారధిగా ఉండడంతో భారతీయ విమానయానం అతలాకుతలమైంది. ఇరాన్ చమురుపై కీలకంగా ఆధారపడ్డ చైనా, ఇరాన్ ఉత్పాదక డ్రోన్లతో ఉక్రెయిన్‌పై దాడులు కొనసాగిస్తున్న రష్యాకు లేని తొందరపాటు భారత్‌కు ఉండకూడదు.

## ఆలయ పూజారుల జీతాలపై పిల్.. విచారణకు సుప్రీంకోర్టు నో

**మొదటిపేజీ తరువాయి -** దేశవ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సేవాదార్లు, ఇతర సిబ్బందికి ఏకరీతి వేతనాలు, సంక్షేమ ప్రణాళికను రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే... న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ ఈ పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ ఆధీనంలోని ఆలయాల్లో పనిచేస్తున్న పూజారులు, సిబ్బంది వేతనాలు, సేవా నిబంధనలను సమీక్షించేందుకు జ్యుడీషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. వేతనాల కోడ్ 2019లోని సెక్షన్ 2(కే) ప్రకారం పూజారులను, ఆలయ సిబ్బందిని 'ఉద్యోగులు'గా గుర్తించి, వారికి కనీస వేతనం, ఇతర కార్మిక సంక్షేమ రక్షణలు కల్పించాలని అభ్యర్థించారు. ప్రభుత్వాలు ఆలయాలపై పరిపాలన, ఆర్థిక నియంత్రణ చేపట్టినప్పుడు ప్రభుత్వానికి పూజారుల మధ్య యజమాని-ఉద్యోగి సంబంధం ఏర్పడుతుందని పిటిషనర్ వాదించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో పూజారులు, సిబ్బంది కేవలం రూ.1,000 నుంచి రూ.5,000 మధ్య ఉన్న నామమాత్రపు గౌరవ వేతనాలు, దక్షిణలపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి పెన్షన్, ఆరోగ్య సంరక్షణ వంటి సామాజిక భద్రత కూడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఆలయాల నియామకాలు, ఆదాయంపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటూ, అక్కడి సిబ్బందికి కార్మిక సంక్షేమ ప్రయోజనాలు నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని ఆయన వాదించారు.అయితే, ధర్మాసనం ఈ పిల్ విచారణకు విముఖత వ్యక్తం చేయడంతో సంబంధిత అధికారులను ఆశ్రయించేందుకు స్వేచ్ఛనిస్తూ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇవ్వాలని అశ్విని ఉపాధ్యాయ్ కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది. పిటిషనర్ ఉపసంహరించుకున్న కారణంగా ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## కర్ణాటకలో రెండు ఏనుగుల భీకరపోరు.. పర్యాటకురాలి మృతి...

**మొదటిపేజీ తరువాయి -**పర్యాటకురాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన కొడగు జిల్లాలో జరిగింది.వివరాల్లోకి వెళితే, దుబారే శిబిరంలోని ఏనుగులకు మావటీలు కొలనులో స్నానం చేయిస్తున్నారు. ఆ సమయంలో అకస్మాత్తుగా రెండు ఏనుగులు ఒకదానిపై ఒకటి దాడి చేసుకుంటూ తీవ్రంగా ఘర్షణకు దిగాయి. దీంతో అక్కడున్న పర్యాటకులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈ క్రమంలో ఓ ఏనుగు అదుపుతప్పి పర్యాటకుల వైపు దూసుకొచ్చి, చెన్నైకి చెందిన మహిళపై పడిపోయింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. ఏనుగులకు స్నానం చేయించేటప్పుడు భద్రతాపరమైన లోపాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలో దుబారే ఏనుగుల శిబిరం చాలా ప్రసిద్ధి చెందింది. రోజూ వందల సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఈ దురదృష్టకర ఘటన నేపథ్యంలో పర్యాటకుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

## కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం.. సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం

**మొదటిపేజీ తరువాయి -** గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయిం చారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే. మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌లకు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

### రాజకీయ ప్రత్యర్థికి హోం శాఖ.. సతీశన్ సంచలనం

కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు. ఇది పార్టీలో అంతర్గత విభేదాలకు ముగింపు పలికి, సమన్వయంతో ముందుకు సాగాలనే సంకేతాలను ఇస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని చెన్నితాల ధ్రువీకరించారు. "పదేళ్ల తర్వాత యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ రోజు కేరళ ప్రజలకు శుభదినం. ప్రజలకు సుపరిపాలన అందించడం మా కర్తవ్యం. నేను హోం శాఖ బాధ్యతలు చేపట్టబోతున్నాను" అని ఆయన తెలిపారు.

### స్పష్టమైన ఆధిక్యంతో యూడీఎఫ్ విజయం

ఈ నెల 4న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో యూడీఎఫ్ కూటమి అద్భుత విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను యూడీఎఫ్ 106 సీట్లు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63, దాని ప్రధాన మిత్రపక్షానికి 22 సీట్లు దక్కాయి. మరోవైపు, అధికారంలో ఉన్న వామపక్ష కూటమి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) కేవలం 35 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయం చవిచూసింది. సీపీఎం 26, సీపీఐ 8 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న చివరి రాష్ట్రమైన కేరళలో కూడా అధికారం కోల్పోవడం గమనార్హం.

# ఎన్నికల టీమ్‌కు కసరత్తు!?

**మొదటిపేజీ తరువాయి -** ముఖ్య మంత్రి, రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో చ ర్చించినట్టు తెలిసింది. అయితే ప్రభుత్వం, పార్టీలో చేయబోయే మార్పులు చేర్పులు రాష్ట్ర అవతరణకు (జూ న్ 2) ముందా? తర్వాతా? అనే అంశపై ఇంకా స్పష్టత రాలేదని ఈ వర్గాల సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వచ్చే నెల జూన్ 7 నాటికి సగం పదవీకాలం (రెండున్నర ఏళ్లు) పూర్తికానుండడంతో ప్రభుత్వ, పార్టీ పనితీరుపై అధిష్టానం ఒక అంచనాకు వచ్చినట్టు చెబుతున్నారు. మంత్రిమండలిలో రెండు బె ర్తుల భర్తీ పూర్తికాకుండానే సగం పదవీకాలం ముగిసింది. కనీసం మిగిలిన రెండున్నర ఏళ్ల వ్యవధిలో అ యినా పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని అధిష్టానం భావిస్తోన్నట్టు తెలిసింది. ప్రస్తుత మంత్రిమండలిలో ప్రాతినిధ్యం లేని జిల్లాలకు, సామాజిక వర్గాలకు ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులు కేటాయించి వచ్చే ఎన్నికలలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చే టీమ్‌ను ఏర్పాటు చేయాలన్నది అధిష్టాన పెద్దలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తోన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. అలాగే ఈ రెండున్నర ఏళ్ల వ్యవధిలో ప్రస్తుత మంత్రుల పనితీరు, వ్యవహారశైలి, తరచూ వివాదాలు, ఆరోపణలు తదితర కోణాల నేపథ్యంలో ఒకరిద్దరికి ఉద్వాసన పలికి కొత్తవారిని మంత్రిపదవులు కట్టబెట్టే అవకాశం లేకపోలేదని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నిక లను సీరియస్‌గా తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన ఇద్దరు మంత్రులపై అధిష్టానం సీరియస్‌గా ఉందని కూడా ఈ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరూ తరచు వివాదాలలో చిక్కుకోవడం వల్ల ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తెస్తున్నారని, వారి పట్ల అధిష్టానం కూడా తీవ్ర అసహనంతో ఉన్నట్టు ఈ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వారిద్దరిని మంత్రిమండలిని నుంచి తప్పించి వారి సామాజిక వర్గాలకు చెందిన వారికే తిరిగి మంత్రి పదవులు కట్టబెడితే ఎలాంటి సమస్య ఉండదనే కోణంలో అధిష్టానం యోచిస్తోన్నట్టు తెలిసింది. ఇలా ఉండగా ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు ప్రస్తుత మంత్రిమండలిలో ప్రాతినిధ్యం లేదు. అలాగే ఎస్టీలలో లంబాడి సామాజిక వర్గానికి కూడా మంత్రి పదవి దక్కలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి ఆశించిన ప్రేమ్‌సాగర్‌రావు తనకు ఇచ్చిన సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని తిరస్కరించారు. ఖాళీగా ఉన్న రెండు మంత్రిపదవులకు పై సమీకరణలను పరిగణనలోకి తీసుకొని భర్తీ చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రాతినిధ్యం లభించని నిజామాబాద్ జిల్లా నుంచి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి రాంమోహన్‌రెడ్డి, లంబాడి సామాజిక వర్గం నుంచి దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఇలా ఉండగా పనితీరు బాగాలేని మంత్రులను తప్పించి కొత్తవారికి అవకాశం ఇచ్చే పక్షంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్లు పరిశీలనకు వచ్చే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. మంత్రివర్గ విస్తరణ, పునర్ వ్యవస్థీకరణ కారణంగా ప్రస్తుత మంత్రుల శాఖలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉండటంతో కీలకమైన శాఖల కోసం కొందరు మంత్రులు ఇప్పటికే అధిష్టాన పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు కూడా సమాచారం. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీ , మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ పరిషత్ ఎన్నికలకు, రాష్ట్ర అవతరణకు ముందు వెనుకాల జరగడం మాత్రం ఖాయమని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆ దిశగా అధిష్టాన పెద్దలు రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు కూడా చెబుతున్నారు.

# రాష్ట్రంలోని ఊపందుకున్న పలు ప్రాజెక్టులు

**మొదటిపేజీ తరువాయి -** భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. ఎన్డీయే ప్రభుత్వంలో తొలి 18 నెలల్లోనే సాగునీటి రంగంపై ఏకంగా రూ.23,793 కోట్లు ఖర్చు చేశారు. ఏపీలో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అయితే ప్రాధాన్య క్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టులను మొదట పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో నిధుల కేటాయింపు, ఖర్చు, పర్యవేక్షణ, అవసరమైన సమస్యలను పరిష్కరించి నిర్దిష్ట గడువులోగా సంబంధిత పనులు పూర్తి చేసేవిధంగా ముందుకువెళ్తున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క జలవనరుల శాఖలోనే ఏకంగా రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగులో పెట్టి వెళ్లింది. ఓ వైపు ఈ బిల్లులు చెల్లిస్తూనే మరోవైపు అనేక సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెడుతూ పనుల్లో వేగం సైతం పెంచారు. 2014-19 మధ్య రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఎందుకంటే ఆ ఐదు సంవత్సరాల్లోనే రూ.11 వేల కోట్ల వరకు నీరు ప్రగతి పనులకు, మరో రూ.50 వేల కోట్లకు పైగా జలవనరుల శాఖకు ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రస్తుతం మళ్లీ ఆ దిశగా పనులు ఊపందుకున్నాయి.

సస్యశ్యామలంగా రాయలసీమ : హంద్రీ-నీవా కాలువ రాయలసీమలోని ఉమ్మడి జిల్లాల్లో పరుగులు తీస్తుంది. కృష్ణా వరద జలాలను 738 కిలోమీటర్ల వరకు తీసుకెళ్తుంది. కేవలం 2,200 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఈ కాలువను వెడల్పు చేయడంతో పాటు లైనింగు పనులు సైతం చేసి దాని ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు పెంచారు. ఈ పనుల కోసం రూ.3,500 కోట్లను ఖర్చు చేశారు. ఈ కాలువ ద్వారా రాయలసీమలోని జిల్లాలకు ఈ సంవత్సరం 43 టీఎంసీలకు పైగా జలాలను విడుదల చేశారు. అందుభాగంగా కుప్పానికి మొదటిసారి నీటిని అందించారు.

పునరావాసానికి రూ. వెయ్యి కోట్లు : అదేవిధంగా వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశ పూర్తి చేయాలంటే ఇంకా నిర్మాణ పనులకోసం రూ.2,000 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సిఉంది. అలాగే పునరావాసానికి దాదాపు రూ. వెయ్యి కోట్లు కావాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక టన్నెళ్ల తవ్వకాల్లోని పెండింగు పనులతో పాటు లైనింగు పనుల వేగాన్ని సైతం పెంచారు. హెడ్ రెగ్యులేటర్ పనులను చేస్తున్నారు. 18 నెలల్లో 3,708 మీటర్ల మేర టన్నెల్ లైనింగు పూర్తయింది. ఫీడర్ కాలువ మరమ్మతులు లైనింగు కోసం ఏకంగా రూ.456 కోట్లు విడుదల చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో వెలిగొండపై ఇప్పటివరకు రూ.571 కోట్లను ఖర్చు చేశారు. పోలవరం ఎడమ కాలువ పనులు సైతం వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టులో గత వైఎస్సార్సీపీ హయాంలో ఒక్క శాతం పనులు కూడా చేయలేదు. ఓ వైపు ప్రధాన డ్యాం నిర్మిస్తున్నా ఎడమ కాలువ పనులు చేయకపోతే ఎలాంటి ఉపయోగం ఉండదు. ఎన్డీయే ప్రభుత్వంలో రూ.1,226 కోట్లతో కాలువలో వివిధ ప్యాకేజీలకు టెండర్లు పిలిపించి పనుల వేగాన్ని పెంచారు. ఇప్పటివరకు రూ.900 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఇలా రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు ఊపందుకున్నాయి,

## భారత్ లో... బట్టతలకు హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్న ఉగ్రవాది!

**మొదటిపేజీ తరువాయి -** పాకిస్థాన్‌లోని లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాది హెయిర్ ప్లాంటేషన్ కోసం తన ఉగ్రదాడిని వాయిదా వేసుకున్న ఘటన ఆశ్చర్యం కలిగిస్తోంది. ఓ కేసు విచారణలో ఈ విషయం వెలుగు చూడటంతో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు నివ్వెరపోయారు. జమ్ము కశ్మీర్ పోలీసులు గత నెల జరిపిన ఆపరేషన్‌లో లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాదులు మహమ్మద్ ఉస్మాన్ జాట్, అబు హురెయిరాను అరెస్టు చేసి, దర్యాప్తు కోసం ఎన్ఐఏకు అప్పగించారు.ఎన్ఐఏ అధికారులు ఇటీవల ఉస్మాన్ జాట్ ను విచారించగా నివ్వెరపోయే విషయం వెలుగు చూసింది. లాహోర్‌కు చెందిన ఉస్మాన్ లష్కరే ఉగ్రవాద సంస్థలో శిక్షణ తీసుకున్నాడు. అనంతరం సరిహద్దు దాటి కశ్మీర్ లోయలోకి జొరబడ్డాడు. జమ్ము కశ్మీర్ వెలుపల స్లీపర్ సెల్స్‌ను ఏర్పాటు చేసే పనిని తమకు అప్పగించినట్లు విచారణలో అంగీకరించాడు. ఈ విచారణలో మరో ఆసక్తికర విషయం కూడా వెలుగుచూసింది. తనకు జుత్తు ఊడిపోవడంతో బట్టతల సమస్యతో బాధపడుతున్నానని, దీంతో తనలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిందని అతను అధికారులకు తెలియజేశాడు. మరో ఉగ్రవాది అబు హురెయిరా సహాయంతో చికిత్స తీసుకున్నట్లు అతడు విచారణలో తెలిపాడు. శ్రీనగర్‌లోని ఒక క్లినిక్‌లో ఉస్మాన్ జాట్ రహస్యంగా హెయిర్ ప్లాంటేషన్ చేయించుకున్నాడు. కొన్నిసార్లు రాత్రంతా క్లినిక్‌లోనే ఉన్నట్లు చెప్పాడు. చికిత్స పూర్తయ్యాక ఉస్మాన్ జాట్ జమ్మూకు చేరుకున్నాడు. అక్కడి నుంచి బస్సులో పంజాబ్ చేరుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఆ తర్వాత అతడు నకిలీ ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్టు కోసం ప్రయత్నించాడు. వాటి సాయంతో దేశం విడిచి పారిపోవాలని ప్రణాళిక వేసుకున్నాడు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ఉత్తర కశ్మీర్, శ్రీనగర్‌లో లష్కరే అనుబంధంగా పనిచేస్తున్న ఓవర్ గ్రౌండ్ వర్కర్ నెట్ వర్క్‌ను పోలీసులు ఛేదించారు.

## నిజామాబాద్ జిల్లాకు రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారు: ధర్మపురి అర్వింద్

**మొదటిపేజీ తరువాయి -** నిజామాబాద్‌కు రేవంత్ రెడ్డి మొండిచేయి చూపించారని ఆరోపించారు. జిల్లాకు ఇంత అన్యాయం జరుగుతుంటే మహేష్ కుమార్ గౌడ్ ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఇక్కడ తిరుగుతున్నారంటూ అరవింద్ ఘాటుగా ప్రశ్నించారు. నిజామాబాద్ నగరానికి ఔటర్ రింగ్ రోడ్ ఇస్తామని నాడు హామీ ఇచ్చి, నేడు ఆ ఊసే ఎత్తకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, దీనికి ప్రజలే త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిజామాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పన, డ్రైనేజీ పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అర్వింద్ విమర్శించారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ. 162 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం కేవలం రూ. 10 కోట్లు మాత్రమే కేటాయించిందని, కనీసం 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదని వివరించారు. దేవుళ్ళకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చకుండా మోసం చేసిన రేవంత్ రెడ్డికి, ప్రజలను మోసం చేయడం ఒక లెక్కా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ హయాంలో ఈ డ్రైనేజీ పనులు ఎప్పటికీ పూర్తికావని ఆయన కుండబద్దలు కొట్టారు. బుల్లెట్ రైల్ కారిడార్, 'ఫ్యూచర్ సిటీ' వ్యవహారాల్లో కూడా ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, గతంలో నగరాన్ని అప్‌గ్రేడ్ చేస్తానన్న కేసీఆర్‌నే నమ్మని ప్రజలు, ఇప్పుడు రేవంత్ రెడ్డి చెబుతున్న లేని ఫ్యూచర్ సిటీని అస్సలు నమ్మరని చురకలు అంటించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు, జాతీయ పరిణామాలపై అర్వింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2039 వరకు రాహుల్ గాంధీ దేశ ప్రధాని కాలేరని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డే ప్రకటించారని, దీనర్థం దేశంలో ఇంకో పదేళ్ల పాటు బీజేపీ అధికారంలోనే ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నట్లేనని విశ్లేషించారు. రేవంత్ రెడ్డి మోసపూరిత రాజకీయ నాయకుడని... కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి నిజాయతీ గల నాయకుడిని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమిస్తే బాగుంటుందని కాంగ్రెస్ అధిష్ఠానానికి అర్వింద్ సూచించారు.

## త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్.. ఇక ప్రయాణం సుఖమయం



**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసి పోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎల్బీనగర్ - మియాపూర్, నాగోల్ - రాయదుర్గం మార్గాల్లో రైళ్లలో నిలబడటానికి కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే అదనపు కోచ్‌ల కొనుగోలు అనివార్యంగా మారింది. ఆర్డర్ ఇచ్చిన నాటి నుంచి కేవలం 15 నెలల వ్యవధిలోనే కొత్త కోచ్‌లను సరఫరా చేస్తామని బీఈఎంఎల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. గతంలో రద్దీని అధిగమించేందుకు నాగ్‌పూర్ మెట్రో నుంచి కొన్ని కోచ్‌లను లీజుకు తీసుకోవాలని ప్రయత్నించినా, సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కోచ్‌ల కొనుగోలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో బీఈఎంఎల్‌కు ఆర్డర్ ఇచ్చే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 2015లో సుమారు రూ.1800 కోట్లతో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ రొటెమ్ సంస్థ నుంచి మెట్రో కోచ్‌లను కొనుగోలు చేశారు. ఇప్పుడు కొత్త కోచ్‌ల తయారీ కోసం హ్యుందాయ్ తమ సాంకేతికతను బీఈఎంఎల్‌కు బదిలీ చేసేందుకు అంగీకరించింది. దేశంలోని అనేక మెట్రో ప్రాజెక్టులకు విజయవంతంగా కోచ్‌లను సరఫరా చేసిన అనుభవం బీఈఎంఎల్‌కు ఉంది. ఈ 60 కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే, రద్దీ మార్గాల్లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో పాటు ప్రయాణికులకు సీటింగ్ సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఫలితంగా మెట్రో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, సుఖవంతంగా మారనుంది.

## భారత్,నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

**మొదటిపేజీ తరువాయి -** సాధించలేమని ప్రధాని మోదీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని, ఉక్రెయిన్ వివాదాన్ని చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'భారత్ , నార్వే రెండూ కూడా నియమ, నిబంధనలతో కూడిన ప్రపంచ వ్యవస్థను, చర్చలను, దౌత్యాన్ని విశ్వసిస్తాయి. కేవలం సైనిక ఘర్షణ ద్వారా మాత్రమే ఏ సమస్యనూ పరిష్కరించలేమని మేము ఇద్దరం భావిస్తున్నాం. ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలు వీలైనంత త్వరగా ముగియడానికి, శాంతి స్థాపన కోసం జరిగే ప్రతి ప్రయత్నానికి మేము మా మద్దతును ఇస్తాం."

**- భారత ప్రధాని మోదీ**

అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాలి నాలుగు ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా స్వీడన్ నుంచి నార్వే రాజధాని ఓస్లో చేరుకున్న కొద్ది గంటల్లోనే మోదీ, ఆ దేశ ప్రధాని స్టోర్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణలు తీసుకురావడం అత్యవసరం. ఈ విషయంలో నేను, నార్వే ప్రధాని ఏకాభిప్రాయంతో ఉన్నాం. అంతేకాదు ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాల్లోనూ సమూలంగా నిర్మూలించడం మన ఉమ్మడి బాధ్యత" అని మోదీ స్పష్టం చేశారు.

### నిజమైన స్నేహం

గతేడాది పహల్గాంలో హిందూ పురుషులే లక్ష్యంగా జరిగిన పాక్ ప్రేరిపిత ఉగ్రదాడిలో, భారత్ కు చెందిన 26 మంది పౌరులు మరణించారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని మోదీ, ఆ క్లిష్ట సమయంలో భారత్ కు నార్వే అందించిన మద్దతును మోదీ కొనియాడారు. "నేను గత ఏడాదే నార్వేలో పర్యటించాల్సి ఉంది. కానీ పహల్గాం ఉగ్రదాడి కారణంగా ఆ పర్యటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఆ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నార్వే, భారతదేశానికి అండగా నిలబడి, నిజమైన స్నేహాన్ని చాటుకుంది. ఈ రోజు నేను నార్వేను సందర్శిస్తున్న తరుణంలో, వారు చూపిన సంఘీభావానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను."

**- భారత ప్రధాని నరేంద్ర మోదీ**

చాలా ప్రయోజనాలున్నాయ్ ఇటీవల భారత్, ఈయూ మధ్య చారిత్రక ఒప్పందం జరిగిందని, దీని వల్ల భారత్ , నార్వేలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయన అన్నారు. "భారత్ , నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. నార్వే నుంచి సాంకేతికత, పెట్టుబడులు భారత్ కు వస్తున్నాయి. అలాగే వివిధ రంగాల్లో పరిశోధనల కోసం నార్వే నుంచి మేము సాయం తీసుకుంటాం. ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయి. డడ ఇక ఇరుదేశాల మధ్య ఉన్న గ్రీన్ స్ట్రేటజీ వల్ల ప్రపంచ దేశాలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. మారిటైమ్ భద్రత విషయంలోనూ మేము నార్వేతో కలిసి పనిచేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతదేశం నేతృత్వంలోని ఇండో-పసిఫిక్ మహాసముద్రాల చొరవ (ఇండో-పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్ )లో చేరాలని నార్వే తీసుకున్న నిర్ణయాన్ని కూడా మోదీ అభినందించారు. "రెండు ప్రధాన సముద్రతీర దేశాలుగా, మేము సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ, సముద్ర భద్రత, సామర్థ్య పెంపుదలలో సహకారాన్ని బలోపేతం చేయడానికి కలిసి పనిచేస్తాం" అని అన్నారు.

### మోదీకి నార్వే అత్యున్నత పురస్కారం

అంతకు ముందు, ప్రధాని నరేంద్ర మోదీకి, నార్వే తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను ప్రదానం చేసింది. ఇది మోదీకి లభించిన 32వ అంతర్జాతీయ పురస్కారం కావడం గమనార్హం.

## రిక్షా తొక్కుతూ నిరసన వ్యక్తం చేసిన అంబటి రాంబాబు




**మొదటిపేజీ తరువాయి -** ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలోని ఇతర అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఇంధన ధరలు అత్యంత ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు చెప్పిన 'సంపద సృష్టి', 'సుపరిపాలన' అంటే ఇదేనా అంటూ నిలదీశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్ర పన్నులను తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేస్తామని హామీలు గుప్పించిన నారా లోకేష్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకుండా ప్రజలను నట్టేట ముంచారని అంబటి రాంబాబు మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వానికి కేవలం కమీషన్లు వచ్చే పనులపైనే శ్రద్ధ ఉందని, ప్రజల కష్టాలు వారికి పట్టడం లేదని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు ప్రజలకు చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని విమర్శించారు. ఒకవైపు ఇంధన ధరల భారంతో సామాన్యుడు నలిగిపోతుంటే, మరోవైపు ఆర్టీసీ, మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దుయ్యబట్టారు. తక్షణమే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకపోతే వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కేవలం వైసీపీ నేతలపైనే కాకుండా, టీడీపీతో కలిసి ఉన్న జనసేన పార్టీ నేతలపై కూడా అమలు చేస్తున్నారని ఆరోపించారు. ముట్లూరులో జరిగిన ఘర్షణల నేపథ్యంలో జనసేన కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారని, అదే సమయంలో టీడీపీకి చెందిన కల్యాణ చక్రవర్తిపై ఉన్న కేసులను మాత్రం ప్రభుత్వం దొడ్డిదారిన మాఫీ చేస్తోందని వివరించారు. తన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడతానని ప్రగల్భాలు పలికే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, తన సొంత పార్టీ వారికి అన్యాయం జరుగుతున్నా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. తమను గెలిపించిన సొంత ఓటర్లు, కార్యకర్తలపైనే అధికార మదంతో కేసులు పెడుతూ వేధిస్తున్నారని మండిపడ్డారు. దక్షిణ భారతదేశంలో జనాభా సమతుల్యత కోసం ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ.. అసలు అలాంటి విషయాల గురించి మాట్లాడే నైతిక హక్కు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదంటూ అంబటి రాంబాబు తీవ్రంగా విమర్శించారు.

# వేదవతి ప్రాజెక్టుకు వెంటనే నిధులు విడుదల చేయాలి

## - జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సీపీఐ నాయకులు



**ఆలూరు, మే 18 (స్ఫూర్తి పత్రిక):** వేదవతి ప్రాజెక్టుకు తక్షణమే నిధులు కేటాయించి పెండింగ్ పనులను ప్రారంభించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంత అభివృద్ధికి వేదవతి ప్రాజెక్టు అత్యంత కీలకమని పేర్కొన్నారు. సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రాధాన్యంగా తీసుకుని అవసరమైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వేదవతి ప్రాజెక్టు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు కూడా గణనీయమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతాంగ భవిష్యత్తు, వ్యవసాయ రంగ అభివృద్ధి దృష్ట్యా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రాజెక్టు అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చర్యలు చేపట్టేలా జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని నాయకులు కోరారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా కరువు ప్రభావిత ప్రాంతాలకు ఉపశమనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు జగన్నాథం, మునేప్ప, భూపేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ నాయకుడు శివన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరులో టీడీపీ వైపు పెరుగుతున్న ప్రజా ఆకర్షణ





## - వైకుంఠం జ్యోతి సమక్షంలో టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

**ఆలూరు, మే 18 (స్ఫూర్తి పత్రిక):** ఆలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజా మద్దతు రోజురోజుకూ పెరుగుతోందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. హొళగుంద మండలంలోని సులువాయి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీకి అనుబంధంగా ఉన్న పలువురు ముఖ్య నాయకులు, దాదాపు 50 కుటుంబాలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు.ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకం ఉండటంతో పాటు ఆలూరు నియోజకవర్గంలో వైకుంఠం జ్యోతి ప్రజలకు అందుబాటులో ఉంటూ చేస్తున్న సేవలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ, పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ పని చేస్తోందని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో మరింత మంది ప్రజలు టీడీపీ సిద్ధాంతాలకు మద్దతుగా ముందుకు వస్తారని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామాభివృద్ధి, సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలి





**ఆలూరు, మే 18 (స్ఫూర్తి పత్రిక):** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బోయ మునుస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలూరు నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదల జీవనాధారంగా మారిందని పేర్కొన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో కూడా ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక తీర్మానం చేయాలని కోరారు.ఉపాధి కూలీలు పనుల కోసం నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనిందని ఆరోపించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, విశ్రాంతి కోసం నీడ, ప్రాథమిక వైద్య సదుపాయాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు.ప్రస్తుతం కూలీలకు రోజుకు రూ.200 నుంచి రూ.250 వరకు మాత్రమే వేతనం అందుతోందని, పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా కనీసం రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించకూడదన్నారు.ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. గ్రామీణ పేదల జీవన భద్రత కోసం ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# దేవనకొండలో బేకరీలో ఆహార భద్రత శాఖ తనిఖీల



**దేవనకొండ, మే 18 (స్ఫూర్తి పత్రిక):** కర్నూలు జిల్లా దేవనకొండ పట్టణంలోని ఎస్.ఎల్.వీ.బేకరీలో గురువారం ఆహార భద్రత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కేక్ నాణ్యతపై ఫిర్యాదు అందిన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.కర్నూలు జిల్లా ఆహార భద్రత అధికారి రాజగోపాల్ రావు బేకరీని పరిశీలించి సంబంధిత ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై నిర్ధారణ కోసం నమూనాలను పరీక్షల నిమిత్తం చెన్నైలోని ప్రయోగశాలకు పంపనున్నట్లు వెల్లడించారు.సేకరించిన నమూనాల పరీక్షా ఫలితాలు సుమారు 40 రోజులలో వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రయోగశాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఆహార పదార్థాల నాణ్యత విషయంలో వ్యాపార సంస్థలు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే అంశాలపై శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా అనుమానాస్పద ఆహార పదార్థాలపై సంబంధిత అధికారులకు

# ఈతకు వెళ్లి యువకుడు మృతి



**ఆలూరు, మే 18 (స్ఫూర్తి పత్రిక):** ఆలూరు మండలంలోని మనేకుర్తి గ్రామంలో నీటి కుంటలో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన ఉపేంద్ర (18) డిగ్రీ విద్యాభ్యాసం చేస్తున్నాడు. స్నేహితులతో కలిసి సరదాగా గ్రామ సమీపంలోని నీటి కుంటకు ఈతకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు.యువకుడు నీటిలో కనిపించకపోవడంతో అక్కడున్న వారు వెంటనే గమనించి బయటకు తీశారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు.మృతుడు వీరేష్, శివమ్మ దంపతుల చిన్న కుమారుడిగా తెలిసింది. కుటుంబంలో ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడికి ఇప్పటికే వివాహం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉపేంద్ర ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడున్న వారిని కలిచివేసింది.యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.


# ఎంత మంచివాడు... 130 ఏళ్ల వెట్టిచాకిరీ నుంచి పాకిస్థానీ కుటుంబానికి విముక్తి!

పాకిస్థాన్‌లో నాలుగు తరాలుగా, అంటే సుమారు 130 ఏళ్లుగా వెట్టిచాకిరీలో మగ్గిపోతున్న ఒక కుటుంబాన్ని ఓ విదేశీయుడు కాపాడాడు. వారి పూర్వీకులు తీసుకున్న అప్పును స్వయంగా తీర్చి, వారికి స్వేచ్ఛను ప్రసాదించాడు. ఈ సంఘటన పంజాబ్ ప్రావిన్స్‌లోని కసూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. కసూర్‌లోని ఓ ఇటుక బట్టీలో ఒక కుటుంబం తరతరాలుగా పనిచేస్తోంది. 130 ఏళ్ల క్రితం వారి పూర్వీకులు తీసుకున్న 'పేష్కీ' (అడ్వాన్స్ రూపంలో రుణం) తీర్చలేకపోవడంతో, ఆ కుటుంబంలోని నాలుగు తరాల వారు బానిసలుగా మారారు. ఎలాంటి జీతం లేకుండా కేవలం అప్పు కింద గొడ్డు చాకిరీ చేస్తూ వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆరోన్ హచింగ్స్ అనే విదేశీయుడు చలించిపోయారు.'జూబ్లీ క్యాంపెయిన్ ' అనే స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న ఆరోన్, ఆ కుటుంబం బానిసత్వానికి కారణమైన అప్పు మొత్తాన్ని చెల్లించి వారికి విముక్తి కల్పించారు. ఆ కుటుంబ సభ్యులకు స్వేచ్ఛ లభించిందని చెప్పిన క్షణాలను ఆయన వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "మేము అక్కడికి వెళ్లినప్పుడు ఏం జరిగిందో చూడండి.

# మన పొదుపు DNA పోతోంది!

పశ్చిమాసియాలో యుద్ధం జరగడమేమిటి? మనకు తిప్పలు రావడమేమిటి? అని ప్రశ్నించుకుంటే ఈ పరిస్థితికి మన రాజకీయ పార్టీలే ప్రధాన కారణం అన్న సమాధానం లభిస్తోంది. ఒకప్పుడు దేశంలో కరువు కాటకాలు ఏర్పడినా ప్రజలు ఆకలి చావులకు గురికాకుండా పని కల్పించడం ద్వారా ప్రభుత్వాలు ఆదుకునేవి. ఇప్పటిలా ఉచిత పథకాల ద్వారా ప్రజలను సోమరిపోతులను చేయలేదు.ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు వినిమయతత్వం పెంచడం వల్ల మానవ వనరులు నిర్వీర్యమయ్యాయి. దీంతో పనులు దొరకని పరిస్థితి నుంచి పనిచేసే వాళ్లు దొరకని పరిస్థితికి చేరుకున్నాం.సూపర్ బజార్లకు వెళ్లిన వాళ్లు అవసరానికి మించి కొనేలా ప్యాకేజింగ్ చేస్తున్నారు. ఆహారాన్ని కూడా దుబారా చేస్తున్నాం. స్విగ్గీ, జొమాటో వంటి డోర్ డెలివరీ వ్యవస్థలు వచ్చిన తర్వాత అవసరానికి మించి ఆర్డర్లు పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆర్డర్లు ఇంటికి చేరేసరికి మనసు మార్చుకొని వచ్చిన వాటిని పక్కన పడేస్తున్నారు.గతంలో ముఖ్యమంత్రులు సాధారణ ప్రజలవలె ప్రయాణికుల విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు.తెలంగాణలో ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని లారీల్లోకి ఎక్కించడానికి హమాలీలు లభించడం లేదు. గతంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి హమాలీ పనులు చేసే వాళ్లు వచ్చేవారు. వాస్తవ పరిస్థితి ఇది కాగా, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం గురించి గొప్పగా చెబుతోంది. ఉపాధి లభించనప్పుడే కదా ఉపాధికి హామీ ఉండాలి? పని ఉన్నా చేయడానికి మనుషులే దొరకనప్పుడు ఉపాధికి హామీ ఏమిటి?ఒకప్పుడు ప్రపంచ దేశాల పరిణామాలతో సంబంధం లేకుండా తలెత్తుకొని జీవించిన దేశం మనది. ఒకవైపు అభివృద్ధి చెందామని చెబుతూనే మరో వైపు అంతులేని సంక్షేమ పథకాలు దేనికి? ఈ రెండింటిలో ఏది నిజం? ఏది అవసరం?'గడ్డు పరిస్థితులు ఎదురుకాబోతున్నాయి. ప్రజలంతా పొదుపు పాటించాలి. చమురు వాడకం తగ్గించాలి. బంగారం కొనుగోళ్లు నిలిపివేయాలి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు నేతలంతా ఇప్పుడు పొదుపు మంత్రం జపిస్తున్నారు. ప్రధాని నుంచి ముఖ్యమంత్రుల వరకు తమ వాహన శ్రేణుల సంఖ్యను తగ్గించుకున్నారు. పొదుపు వైపు ప్రజలను మళ్లించడానికి ఇటువంటి చర్యలు ఉపయోగపడవచ్చునుగానీ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించగలవా? దేశ స్వావలంబన ఎండమావిగానే మిగిలిపోతుందా? అనే ప్రశ్నలకు మాత్రం సమాధానం లభించదు. భారతీయుల డీఎన్ఏలో పొదుపు అంతర్భాగంగా ఉండేది. పొదుపు చేసుకోవడంతోపాటు కష్టపడి పనిచేయడం భారతీయుల లక్షణం. ఈ రెండు లక్షణాలే మన బలం కూడా! ప్రపంచీకరణ పుణ్యమా అని ఇప్పుడు వీటికి మనం దూరమయ్యాం. కేంద్ర, రాష్ట్రాల పాలకులు పోటీ పడి మరీ ప్రజలను వినిమయతత్వంలోకి నెట్టారు. దీంతో అప్పుచేసి పప్పు కూడు తినడానికి ప్రజలు అలవాటుపడ్డారు. తోటి వాడు తొడ కోసుకుంటే తాను మెడ కోసుకునేలా చేశారు. ఫలితంగా ఇప్పుడు మళ్లీ పొదుపు చేయండి మహాప్రభో అని ప్రజలకు చెప్పాల్సిన పరిస్థితి. పశ్చిమాసియాలో యుద్ధం జరగడమేమిటి? మనకు తిప్పలు రావడమేమిటి? అని ప్రశ్నించుకుంటే ఈ పరిస్థితికి మన రాజకీయ పార్టీలే ప్రధాన కారణం అన్న సమాధానం లభిస్తోంది. ఒకప్పుడు దేశంలో కరువు కాటకాలు ఏర్పడినా ప్రజలు ఆకలి చావులకు గురికాకుండా పని కల్పించడం ద్వారా ప్రభుత్వాలు ఆదుకునేవి. ఇప్పటిలా ఉచిత పథకాల ద్వారా ప్రజలను సోమరిపోతులను చేయలేదు. అప్పు చేయడాన్ని అవమానంగా భావించిన ప్రజలకు... అప్పు చేయడం నిత్యావసరంగా మార్చిన ఘనత రాజకీయ పార్టీలది కాదా? కన్జ్యూమరిజంను ఫ్యాషన్‌గా మార్చింది ఎవరు?సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు, మితిమీరిన వినిమయతత్వంతో ప్రజలు అప్పులపాలు అవడానికి పాలకులు కారణం కాదా? కూలీనాలీ చేసుకునే వారి చేతిలో కూడా రెండేసి సెల్‌ఫోన్లు అవసరమా? ఆ పరిస్థితి ఎందుకొచ్చింది? జీవన ప్రమాణాలు పెరగడమంటే అప్పు చేసి పప్పు కూడు తినడమా? నిజంగా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ఉంటే సంక్షేమ పథకాల అవసరమేమిటి? ఉత్పాదక వ్యయం నుంచి అనుత్పాదక వ్యయంవైపు దేశంతో పాటు ప్రజలూ మళ్లడం వికాసం అవుతుందా? నిజంగా దేశం అభివృద్ధి చెంది ఉంటే మన రూపాయి విలువ నానాటికీ ఎందుకు పతనమవుతోంది? ఎగుమతులు పెంచుకోకుండా విచ్చలవిడిగా దిగుమతులను ప్రోత్సహించడం ఏమిటి? ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా రేపటి గురించి ఆలోచించకుండా అప్పులు చేయడం ఏమిటి? నిజమైన ధనవంతుడు ఎవరు అంటే అప్పులేని వాడని ఒకప్పుడు చెప్పుకొనేవారు. ఇప్పుడు ఎంత ఎక్కువ అప్పు చేస్తే అంత గొప్ప అన్న భావనను వ్యాపింపజేశారు. ప్రభుత్వాలు కూడా లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఏమిటో తెలియదు. ప్రభుత్వాలతోపాటు ప్రజలు కూడా విలాసాలకు అలవాటుపడేలా చేసింది ఎవరు? సంపాదనలో, సామర్థ్యంలో పోటీ ఉండాలి కానీ అప్పులు చేయడంలో పోటీ ఏమిటి? బడా పారిశ్రామికవేత్తలు అప్పులు చేస్తూ ఎగవేస్తుండగా సామాన్య ప్రజలు మాత్రం అప్పుల నుంచి బయటపడేందుకు అప్పు మీద అప్పు చేసుకుంటూ పోతున్నారు. మన దేశానికి మానవ వనరులే అతి పెద్ద ఆస్తి అని గర్వంగా చెప్పుకొనేవాళ్లం. ఇప్పుడు ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు వినిమయతత్వం పెంచడం వల్ల మానవ వనరులు నిర్వీర్యమయ్యాయి. దీంతో పనులు దొరకని పరిస్థితి నుంచి పనిచేసే వాళ్లు దొరకని పరిస్థితికి చేరుకున్నాం. మన దేశానికి అసలైన ప్రమాదం పనులు చేయడానికి మనుషులు దొరకని పరిస్థితుల వల్ల ఏర్పడనుంది.ప్రధానమంత్రి చెబుతున్న పొదుపు విషయానికి వద్దాం! బంగారం కొనుగోళ్లు ఒకప్పుడు తక్కువగా ఉండేవి. మహిళలు పొదుపు చేయడం ద్వారా దాచుకున్న డబ్బుతో బంగారం కొనుక్కొనేవారు. కాసు బంగారం కొనాలన్నా ఒకటికి నాలుగుసార్లు ఆలోచించేవారు. ఇప్పుడు బంగారం కొనడానికి కూడా అప్పులు దొరుకుతున్నాయి. ఏమీ తోచకపోయినా నగల దుకాణానికి వెళుతున్నారు. బంగారం విషయంలోనే కాదు-- ఇంట్లో నిత్యావసరాల వినియోగంలోనూ దుబారా అధికం అయింది. సూపర్ బజార్లకు వెళ్లినవాళ్లు అవసరానికి మించి కొనేలా ప్యాకేజింగ్ చేస్తున్నారు. ఆహారాన్ని కూడా దుబారా చేస్తున్నాం. స్విగ్గీ, జొమాటో వంటి డోర్ డెలివరీ వ్యవస్థలు వచ్చిన తర్వాత అవసరానికి మించి ఆర్డర్లు పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆర్డర్లు ఇంటికి చేరేసరికి మనసు మార్చుకొని వచ్చిన వాటిని పక్కన పడేస్తున్నారు. చమురు వాడకం విషయమే తీసుకుందాం! ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారు కదా? అయినా భద్రతను కుదించడం లేదు. ఇప్పుడు ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఇలాంటి సందర్భాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కాస్త అతి ప్రదర్శిస్తారు. ప్రధాని మోదీపై ప్రస్తుతం ఉన్న మోజు వల్ల కాబోలు ఆయన ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అతిగా స్పందిస్తే విమర్శలపాలు అవుతామన్న వాస్తవాన్ని ఆయన విస్మరించారు. ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు కూడా అలంకరణ అవసరమా? అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలి.గతంలో ముఖ్యమంత్రులు సాధారణ ప్రజలవలె ప్రయాణికుల విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాడటం వేరు! ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటి? అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారు? అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని తిరుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు.ఇంధనం వాడకంలో పొదుపు పాటించాలని ఇప్పుడు చెబుతున్నారుగానీ దేశంలో ఇంధన వినియోగం అమాంతం పెరిగిపోవడానికి కారణం ఎవరు? మన దేశంలో వాహనాల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోంది. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్రాండెడ్ కార్ల ఉత్పత్తిదారులు తమ షోరూంలను మన దేశంలో తెరుస్తున్నారు. ప్రస్తుత ధోరణి కొనసాగితే మన దేశ జనాభాతో వాహనాల సంఖ్య కూడా పోటీ పడుతుంది. ఈ కారణంగా దేశంలో చమురు వినియోగం భారీగా పెరిగిపోయింది. ఫలితంగా విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి పెరిగి మన రూపాయి బలహీనపడుతోంది. ఒకప్పుడు ద్విచక్ర వాహనం కొనుగోలు చేయాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించేవారు. ఇప్పుడు అవసరం ఉన్నా లేకపోయినా అప్పు పుడుతోంది కదా అని అలా వెళ్లి ఇలా బండి కొనుగోలు చేస్తున్నారు. వెహికల్ లోన్ ఇస్తాం, ఏసీ కొనాలనుకుంటున్నారా? మీ ఇంట్లో రిఫ్రిజరేటర్, వాషింగ్ మెషిన్ వంటివి లేవా? అయితే అప్పు ఇవ్వడానికి మేం రెడీ! అని బ్యాంకుల నుంచి ఫోన్లు చేస్తుంటారు. దీంతో కొని పడేస్తే పోలా అని ప్రజలు మొగ్గుచూపుతున్నారు. వాహనం కొనడానికి అప్పు దొరుకుతోంది కనుక దాన్ని నడపడానికి ఎంత ఖర్చవుతుందని లెక్కలు వేసుకోవడం లేదు. ఆదాయ--వ్యయాలకు పొంతన లేకున్నా... దాని నుంచి బయటపడలేని పరిస్థితి ప్రభుత్వ విధానాల వల్ల ఏర్పడింది. ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఖర్చులు పెంచుకుంటూ పోవడం వల్ల ఎంత జీతం వస్తున్నా చాలని పరిస్థితి. ఈఎంఐలకు సరిపడా జీతం రావడం లేదన్న అసంతృప్తి ఉద్యోగులలో ఉంటోంది.పొరుగు వాడి ముందు ఎక్కడా తగ్గకూడదన్న ధోరణి ఏర్పడటంతో ఖర్చుల విషయంలో పోటీపడుతున్నారు. గతంలో ఆదాయాన్నిబట్టి ఇంటి బడ్జెట్ ఉండేది. ప్రభుత్వాలు కూడా ఆదాయానికి అనుగుణంగానే బడ్జెట్‌లకు రూపకల్పన చేసేవి. ఇప్పుడు ఇటు ప్రజలు, అటు పాలకులు కూడా అప్పులను దృష్టిలో పెట్టుకొనే బడ్జెట్‌లను రూపొందించుకుంటున్నారు. ఈ పరిస్థితి ఏ అనర్థాలకు దారితీస్తుందో అని ప్రజలతో పాటు ప్రభుత్వాలు కూడా ఆలోచించడం లేదు. అప్పు తీర్చడం ఎలా? అని ఆలోచించకుండా ఇప్పుడు అప్పు పుడుతుందా లేదా అని మాత్రమే ఆలోచిస్తున్నాం. హైదరాబాద్‌లో ఔటర్ రింగు రోడ్డుపై కూడా సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ అయ్యే పరిస్థితి ఏర్పడుతోందంటే వాహనాల సంఖ్య ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. అలా వెళ్లి ఇలా వాహనంతో ఇంటికి వచ్చే పరిస్థితి ఉన్నప్పుడు ఇలాగే ఉంటుంది మరి. వినిమయతత్వం అనే విష వలయంలో ఇప్పుడు మన దేశం చిక్కుకుంది. అతి వినియోగం వల్ల ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతోంది. దీంతో సంక్షేమ పథకాలు పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి నెలనెలా సమకూరే జీఎస్టీ ఆదాయం పెరుగుతోంది అని మురిసిపోతున్నాం. అయితే, ఈ మెరుపుల వెనుక అప్పులు పెరుగుతూ ఉన్నాయని మరచిపోతున్నాం. ప్రభుత్వాలతోపాటు ప్రజలు కూడా అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ఈ అప్పుల విష వలయంలో చిక్కుకోవడంవల్ల సంపాదించే కుటుంబ పెద్ద అకాల మరణంపాలైతే ఆయా కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.ప్రభుత్వాల విషయానికి వస్తే... పాలకులు వస్తూ పోతుంటారు. వారికి వ్యక్తిగతంగా పోయేది ఏమీ ఉండదు. ప్రజలను పొదుపు నుంచి దూరం చేసిన రాజకీయ పార్టీలు సంక్షేమం పేరిట ప్రజలను మూకుమ్మడిగా సోమరిపోతులుగా మార్చివేస్తున్నాయి.

# తిరుమలలో ప్రత్యేక దర్శనాలు రద్దు ఎప్పటి నుంచి ఎందుకో తెలుసా..!



తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన మార్క్ చూపిస్తున్నారు శ్యామలరావు. సీఎం ఆదేశాలతో తిరుమల కొండపై ప్రక్షాళన చేపట్టారు. ముప్పై రోజుల పాటు వరుస తనిఖీలు నిర్వహించారు. తిరుమల పవిత్ర దగ్గర నుంచి.. భక్తుల దర్శన సమస్యల వరకు. లడ్డూ క్వాలిటీ మొదలుకుని.. ఐటీ లోపాల వరకు. ఇలా అన్ని విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.తాజాగా తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. శ్రీవారి ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలు, వివిధ ప్రత్యేక దర్శనాలను అక్టోబరు 3 నుండి 12వ తేదీ వరకు టీటీడీ రద్దు చేసింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తిరుమల శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో స్వామి వారి వాహన సేవలు వీక్షించేందుకు తిరుమలకు సామాన్య భక్తులు సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో హాజరు అవుతారని భావిస్తున్న టీటీడీ, ఈ నిర్ణయాన్ని ప్రకటించింది.శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించేందుకు బ్రహ్మోత్సవాలలో బ్రేక్ దర్శనాలు, వివిధ ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఇందులో భాగంగానే బ్రహ్మోత్సవాలు కు అంకురార్పణ జరిగే అక్టోబరు 3 నుండి 12 చక్రస్నానం నిర్వహించేంత వరకు ప్రతి రోజు వయో వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను సైతం టీటీడీ రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే టీటీడీ పరిమితం చేసింది. భక్తులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని టీటీడీ కోరుతోంది.ఇదిలావుంటే, శ్రీవారి దర్శన టికెట్ల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని టీటీడీ గుర్తించింది. ఆన్‌లైన్ సేవా టికెట్లు, దర్శనం టికెట్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయాలని యోచిస్తోంది. అలా చేయడం వల్ల అక్రమాలు అరికట్టవచ్చని భావిస్తున్నారు. అలాగే టీటీడీకి వెన్నుముకగా ఉన్న ఐటీ వ్యవస్థను వేగవంతం చేసేందుకు జియో, టిసిఎస్ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నారు. రానున్న రోజుల్లో తిరుమల మరింత కొత్తగా కనిపించడం ఖాయమంటున్నారు ఈవో శ్యామలరావు. తిరుమల పవిత్రతను కాపాడుతూనే.. అద్భుత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు ఈవో.

# పవన్ మార్క్ గ్రామ పాలనకు పూర్వ వైభవం



జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా తనదైన ముద్ర వేస్తున్నారు. పంచాయతీరాజ్ మంత్రిగా గ్రామ సీమలను సిరుల సీమలుగా మార్చేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాల్లో మొదటి అడుగు బలంగా పడుతోంది.రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు గ్రామ సభల్ని నిర్వహిస్తున్నారు. ఈ గ్రామసభల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ప్రభుత్వ యంత్రాంగం అంతా పాల్గొంటోంది. గ్రామాల్లో సమస్యల పరిష్కార లక్ష్యంగా ఈ సభలు జరగనున్నాయి.గత ఐదేళ్ల కాలంలో పంచాయతీల్ని..గ్రామ పాలనను.. గ్రామాల అస్థిత్వాన్ని వైసీపీ సర్కార్ ప్రశ్నార్థకం చేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చి గ్రామ పాలనకు అర్థం లేకుండా చేసింది. పాలనలో గ్రామీణ వ్యవస్థల ప్రమేయం లేకుండా చేయడం.. పెద్ద ఎత్తున నిధుల్ని మళ్లించడంతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాయి. నీటి అవసరాలు తీర్చడానికి మోటార్లకు రిపేర్లు చేయించేందుకూ సర్పంచ్‌ల వద్ద డబ్బులు ఉండేవి కావు.మరో వైపు ఉపాధి హామీ పథకం నిధులతోనూ రాజకీయమే చేశారు. తమ పార్టీ కార్యకర్తలకు అవసరం అని.. లేపోని భవనాలను నిర్మించి ఉపాధి హామీ నిధుల్ని దుర్వినియోగం చేశారు. ఆ భవనాల కాంట్రాక్టుల్ని తీసుకుని వైసీపీ నేతలు సంపాదించుకున్నారు. గ్రామాల్లో అసలు రోడ్లే వేయలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు ఉన్నాయి. అన్నింటినీ గ్రామ సభల ద్వారా పరిష్కరించడం .. ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోవచు కానీ ఆ సమస్యల పరిష్కారానికి ఓ మార్గం అంటూ ఈ గ్రామసభల ద్వారా ఏర్పడుతుంది. ప్రజలు కోరుకునేది కూడా ఇదే. పవన్ కల్యాణ్ ఆ మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖలో పవన్ మార్క్ ప్రారంభమయిందని అనుకోవచ్చు.

# కాంగ్రెస్‌కు మరో 25 సీట్లు వస్తే రాహుల్ ప్రధాని అయ్యేవారు ఖర్గే



పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి మరో 25 స్థానాలు వచ్చి ఉంటే, రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేవారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు.జమ్మూలో గురువారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఫలితాలు ప్రతికూలంగా వచ్చినా ప్రధాని మోదీ అహంకారం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా తొలగించి, ఏ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇక్కడున్న లెఫ్టినెంట్ గవర్నర్ ఓ మహారాజులా మారారని ఖర్గే ధ్వజమెత్తారు. ఒక నియంత సంపూర్ణ మెజార్టీతో కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే ఇండియా కూటమి సాధించిన అతిపెద్ద విజయంగా పేర్కొన్నారు. కశ్మీర్‌తో తనది రక్తసంబంధమని చెప్పిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ.. శ్రీనగర్‌లో ఓ హోటలుకు వెళితే జమ్మూకశ్మీర్ ప్రజలంటే మీకు ఇష్టమా? అని ఓ వ్యక్తి అడిగిన ప్రశ్న చికాకు కలిగించిందన్నారు. "నాకు ఇక్కడి ప్రజలంటే ఇష్టం లేదు.. ప్రేమ ఉంది" అని తాను బదులిచ్చినట్లు తెలిపారు.మోదీ బాడీలాంగ్వేజీ మారింది : రాహుల్‌పార్లమెంటు ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మోదీ బాడీలాంగ్వేజీ, ఆత్మవిశ్వాసంలో గణనీయమైన మార్పు వచ్చిందని రాహుల్‌గాంధీ తెలిపారు. రాజ్యాంగానికి మోదీ తల వంచేలా చేయడం కాంగ్రెస్ కార్యకర్తల ఘనతే అన్నారు. శ్రీనగర్‌లో పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన కుటుంబం ఈ ప్రాంతం నుంచే వచ్చిందని, జమ్మూకశ్మీర్ ప్రజల తరఫున దిల్లీలో ఓ సిపాయిలా నిలబడతానన్నారు. "పార్టీకి కష్టకాలంలో కొందరు జెండా కింద పడేసి పారిపోయారు. కార్యకర్తలు మాత్రం నిలబడి బుల్లెట్లు, దాడులు ఎదుర్కొన్నారు" అని కాంగ్రెస్ మాజీ నేత గులాం నబీ ఆజాద్ పేరెత్తకుండా రాహుల్ వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడమే కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

# వైకాపాలో మార్పులు.. చేర్పులు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డిటెక్కలిలో దువ్వాడ ఔట్.. పేరాడకు బాధ్యతలుఈనాడు, అమరావతి: ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైకాపాలో ఇప్పుడు కొన్ని మార్పులు..చేర్పులకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ సిద్ధమయ్యారు.పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి(రాయచోటి), మాజీ ఎమ్మెల్సీ వేంపల్లి సతీష్‌రెడ్డి(పులివెందుల), మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి(చంద్రగిరి) గురువారం నియమితులయ్యారు. వీరికి రాష్ట్రస్థాయిలో కొన్ని జిల్లాల పార్టీ సమన్వయ బాధ్యతలను అప్పగించనున్నారు. వీటితోపాటు మరికొన్ని మార్పుల వివరాలను వైకాపా కేంద్ర కార్యాలయం గురువారం రాత్రి ప్రకటించింది. పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీకి ఇటీవలే ఆళ్ల నాని రాజీనామా చేశారు. దీంతో ఏలూరు జిల్లా అధ్యక్ష పదవిని కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు అప్పగించారు. టెక్కలి నియోజకవర్గ పార్టీ బాధ్యుడిగా ఉన్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై వేటు వేశారు. ఆ నియోజకవర్గ బాధ్యతను పేరాడ తిలక్‌కు అప్పగించారు. కొంతకాలంగా శ్రీనివాస్ కుటుంబ వ్యవహారం రచ్చకెక్కిన సంగతి తెలిసిందే.వైకాపా అనుబంధ విభాగాల్లోనూ మార్పు చేశారు. ఆయా విభాగాల రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన వారు.. యువజన విభాగం- రాష్ట్ర అధ్యక్షుడిగా జక్కంపూడి రాజా, బీసీ విభాగానికి ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, ఎస్సీ విభాగం- మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, చేనేత విభాగం- గంజి చిరంజీవి, విద్యార్థి విభాగానికి పానుగంటి చైతన్యను నియమించారు.

# 14 గంటల తర్వాత ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేశారు? సుప్రీం కోర్టు సీరియస్!



కోల్‌కతాలో డాక్టర్ అత్యాచారం, హత్య కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. 14 గంటల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు కావడానికి కారణమేమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాలేజీ ప్రిన్సిపాల్ నేరుగా వచ్చి చర్యలు తీసుకోవాల్సి ఉందని, 30 ఏళ్లలో ఇలాంటి కేసు చూడలేదని సుప్రీం కోర్టు ఎవరిని కాపాడుతోంది. ఈ కేసును వైట్‌వాష్ చేసేందుకు ప్రయత్నించారని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. విచారణ నిబంధనలను పట్టించుకోలేదు. ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో ఆసుపత్రి పాలకవర్గంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ప్రశ్నించారు.కోల్‌కతాలోని ఓ ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం-హత్య ఘటనపై దర్యాప్తునకు సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) సుప్రీంకోర్టులో స్టేటస్ రిపోర్టును సమర్పించింది . ఈ ఘటన దేశవ్యాప్తంగా వైద్యుల సమ్మెకు దారి తీసింది. భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. దేశం మరో అత్యాచారం కేసు కోసం వేచి ఉండదని, వైద్యులు తిరిగి విధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేసింది. ఆసుపత్రులలో వారి భద్రతకు భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఇందు కోసం నేషనల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. కేసు డైరీ హార్డ్ కాపీని సుప్రీంకోర్టు కోరింది. ఈ కేసులో తదుపరి విచారణ సెప్టెంబర్ 5న జరగనుంది. విచారణ సందర్భంగా, బెంగాల్ ప్రభుత్వ న్యాయవాది కపిల్ సిబల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మధ్య వాదోపవాదాలు జరిగాయి. మా నాయకులకు వ్యతిరేకంగా మాట్లాడే వారి వేళ్లు నరికేస్తానని బెంగాల్ మంత్రి ఒకరు చెబుతున్నారని సొలిసిటర్ జనరల్ కోర్టుకు నివేదించారు. దీనిపై న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలు కూడా కాల్పులు జరపాలని మాట్లాడుతున్నారని అన్నారు. ఇరువురి వాదనలు విన్న తర్వాత, అన్ని రకాల చర్యల నుంచి రక్షణ కల్పిస్తామని, మీరు తిరిగి విధుల్లో చేరాలని సీజేఐ డీవై చంద్రచూడ్ వైద్యులకు విజ్ఞప్తి చేశారు.

"న్యాయం, వైద్యం ఆపలేం. మనం కూడా పని వదిలేసి సుప్రీంకోర్టు బయట కూర్చుంటామా? డాక్టర్లు 13 రోజులుగా పని చేయడం లేదు. ఇది సరికాదు. దూర ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. వారి ప్రాణాలను కాపాడాల్సి బాధ్యత వైద్యులపై ఉంది" అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.వైద్యుల భద్రత కోసం జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, డిస్ట్రెస్ కాల్ సిస్టమ్‌ను రూపొందించడం వంటి సూచనలు అందించామని సీజేఐ డీవై చంద్రచూడ్ అన్నారు అలాంటి సూచనలన్నింటినీ టాస్క్‌ఫోర్స్ పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. శాంతియుత నిరసనలపై బలప్రయోగం చేయవద్దని గత విచారణలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని, నిరసనను అనుమతించే లేదా తిరస్కరించే రాష్ట్ర హక్కును హరించలేదని స్పష్టం చేయాలని సీజేఐ అన్నారు.బెంగాల్ ప్రభుత్వం తరపు న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసహజ మరణాల కేసుల్లో దర్యాప్తు, ఎఫ్ఐఆర్‌కు ఇప్పటికే కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయని, వాటి ప్రకారం పనిచేశామని చెప్పారు. దీనిపై సీజేఐ మాట్లాడుతూ.. ఇది వేరే విషయం.. మృతదేహం దొరికిన 14 గంటల తర్వాత ఎఫ్ఐఆర్ రాశారు. ప్రిన్సిపాల్ వెంటనే ఫిర్యాదు చేసి ఉండాల్సిందని అన్నారు. కాగా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజీనామా చేసిన కొంత కాలం తర్వాత ఆయనను మరో కాలేజీలో నియమించింది బెంగాల్ సర్కార్.ఇక ఈ వ్యవహారంలో దాదాపు పది రోజులుగా మౌనంగా ఉన్న %ఐవీజ% ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎట్టకేలకు స్పందించారు. కోల్‌కతా డాక్టర్ హత్యా వ్యవహారంలో ఆందోళనలు జరుగుతున్న ఈ పది రోజుల వ్యవధిలో దేశంలో తొమ్మిది వందలకు పైగా అత్యాచారాలు జరిగాయని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తెలిపారు. వీటి పరిష్కారం గురించి ఎక్కడా చర్చ జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచార కేసుల్లో 50 రోజుల్లో విచారణ పూర్తై, శిక్షలు పడే కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిషేక్ బెనర్జీ అభిప్రాపడ్డారు. సమగ్ర చట్టం తెచ్చేలా కేంద్రంపై రాష్ట్రాలన్నీ ఒత్తిడి తేవాలని సూచించారు. ఇది కాకుండా ఏం చేసినా అది కేవలం లాంఛనప్రాయంగా ఉంటుందని తప్ప ఎటువంటి ప్రభావమూ ఉండదని ట్వీట్‌లో అభిషేక్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తన మేనత్త మమతా బెనర్జీ తీరుపై అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరుగుతున్నా వేళ అభిషేక్ స్పందన లో కలకలం సృష్టిస్తోంది.మరో వైపు డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగిన కోల్‌కతాలోని సదరు ఆస్పత్రిలో %జxాఖీ% భద్రత ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో %జxాఖీ% సిబ్బంది ఆస్పత్రి సెక్యూరిటీ విధుల్లో చేరారు. ఈ ఆస్పత్రిలో %జxాఖీ% సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఈ మధ్యే ఆదేశించింది.

# హైదరాబాద్ పునర్నిర్మాత రేవంత్ !



కోటిన్నర మంది ప్రజల్ని కడుపులో పెట్టుకుని పోషిస్తున్న నగరం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సగం కుటుంబాలకు ఆసరాగా ఉంటున్న నగరం. ఈ నగరం ఎంత బాగుంటే మన రాష్ట్రం ..పొరుగు రాష్ట్రాలు.. తెలుగు ప్రజలు అందరూ బాగుంటారు. ఇక్కడున్న వారికి హైదరాబాద్ చరిత్ర అక్కర్లేదు. భవిష్యత్ మాత్రమే కావాలి. అందమైన హైదరాబాద్.. ఆరోగ్యకరమైన హైదరాబాద్.. ప్రశాంతమైన హైదరాబాద్ కోరుకుంటారు. వర్షం వస్తే మనిగిపోనిది.. విపత్తులొస్తే కడుపులో దాచుకునేది తమ నగరం అని గట్టిగా చెప్పుకోవాలనుకుంటారు. కానీ దురదృష్టవశాత్తూ హైదరాబాద్ సిటీ పెరుగుతున్న కొద్దీ సమస్యలు రెట్టింపు అవుతున్నాయి. స్వార్థ పరుల చేతిలో చిక్కి హైదరాబాద్ విలవిల్లాడుతోంది. ఓ వైపు అభివృద్ధి సూచికలు బలంగా కనిపిస్తున్నాయి.. అదే సమయంలో చేసిన తప్పులూ వెంటాడుతున్నాయి. ఐదేళ్లు.. పదేళ్లుగా చేసిన తప్పులు కాదు.. మూడు, నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న తప్పులు ఇప్పుడు హైదరాబాద్‌ను వెంటాడుతున్నారు. ఆ తప్పులు సరిదిద్దడం అంత తేలిక కాదు. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఆ బాధ్యత తీసుకున్నారు. ఆయనకు తెలుసు%ొా% ఈ ఆ పని అంత సులువైనది.. తేలికైనది కాదని.. ముళ్ల బాటేనని క్లారిటీ ఉంది. అయినా సరే సురక్షిత హైదరాబాద్ కోసం ఆయన మహా యజ్ఞమే ప్రారంభించారు. ఇప్పుడు చూపిస్తున్న పట్టుదలే యజ్ఞం పూర్తయ్యేదాకా కొనసాగించాలి, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా భరించాలి. అప్పుడే ఆయన పేరు చరిత్రలో నిలిచిపోతుంది.

## అభాగ్య నగరాన్ని మళ్లీ భాగ్యనగరంగా మార్చే ప్రయత్నం

హైదరాబాద్‌ను ప్రపంచంలోనే కీలకమైన నగరంగా రూపుదిద్దాలని రేవంత్ పదవి చేపట్టిన మొదటి రోజు నుంచి ప్రయత్నిస్తున్నారు. లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసి మూసీని సుందరీకరించడానికి ప్రణాళికలు వేశారు. హైదరాబాద్‌లో ప్రతి మూలకు మెట్రో వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతకు ముంచి ఫోర్త్ సిటీని కూడా సిద్ధం చేస్తున్నారు. అత్యంత ప్రణళికా బద్ధంగా ఎవరూ ఊహించని విధంగా.. సైబరాబాద్ ను మించిన సిటీగా దాన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ఇవన్నీ చేయడానికి కారణం.. పరిపాలనలో.. అభివృద్ధిలో తనదైన ముద్ర వేయాలన్న సంకల్పమే. అయితే ఇవననీ అభివృద్ధి పనులు. ఎవరు అధికారంలో వారు అవన్నీ తామే చేశామని చెప్పుకుంటారు. ఇవాళ రేవంత్ అంతా చేసినా పదేళ్ల తర్వాత ఆయన అధికారం కోల్పోతే తర్వాత వచ్చే పార్టీ అంతా తామే చేశామని చెప్పుకుంటుంది. కావాలంటే పేర్లు కూడా మార్చేసుకుంటారు. కానీ ప్రజల్లో పడే ముద్ర కీలకం. అలాంటి ముద్ర పడాలంటే%ొా% ముందు రేవంత్ రెడ్డి తాను చేపట్టిన హైదరాబాద్ తప్పుల్ని కరెక్ట్ చేసే పనిని చిత్తశుద్ధితో కొనసాగించారు. హైడ్రా పేరుతో తానే చైర్మన్ గా చేసిన వ్యవస్థకు రంగనాథ్ లాంటి ఐపీఎస్ ఆఫీసర్‌ను నియమించారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో వ్యవస్థ ఏర్పాటు కాలేదు కానీ.. హైడ్రా పవర్ ఏంటో రంగనాథ్ చూపించారు. చెరువు శిఖం భూముల్ని కబ్జా చేసిన వారందరికీ దడ పుట్టించారు.

## ఆరంభశూరత్వం కాదని ప్రజలకు నమ్మకం

చెరువుల్ని కబ్జా చేయడం అనే రోగం.. హైదరాబాద్‌లో రియల్ భూమ్ ప్రారంభమైనప్పటి నుంచి ఊపందుకుంది. హైడ్రా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరవాత రంగనాథ్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ కు 44 ఏళ్ల కిందట చెరువు పరిస్థితిపై నివేదిక అడిగారు. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం 44 ఏండ్లలో చాలా చెరువులు కనుమరుగయ్యాయి. ఇందులో అనేక చెరువులు 60 శాతం, 80 శాతం, కొన్ని చోట్ల వందకు వంద శాతం కబ్జాలకు గురయ్యాయి. ఈ చెరువుల్లో మొదటి దశలో భాగంగా అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని హైడ్రా నిర్ణయించింది. రెండో దశలో భవనాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకుని కన్ స్ట్రక్షన్స్ అనుమతులు నిరాకరించడం.. పనులు ఆపేయడం చేశారు. మూడో దశలో చెరువుల పూడిక తీసి వాన నీటిని మళ్లించి పునరుజ్జీవం కల్పిస్తారు. రంగనాథ్ లక్ష్యాల ప్రకారం చూస్తే%ొా% ఎంతో ఉన్నతంగా ఉంది. అందుకే ప్రజలు సంపూర్ణంగా మద్దతు పలుకుతున్నారు. ఇటీవలి కాలంలో ఓ ప్రభుత్వం చేస్తున్న కరెక్షన్ కు ప్రజలు ఇంత పూర్తి స్థాయిలో మద్దతు పలకడం ఇదే మొదటి సారి. రాజకీయ పార్టీలు.. రాజకీయ నేతలు ప్రతి అడుగుకూ అడ్డం పడతారు.. అది బహిరంగ రహస్యం. ఇప్పటికే పార్టీ ఫిరాయించి వచ్చిన దానం నాగేందర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమణల తొలగింపును ఆయన అడ్డుకున్నారు. అయితే అధికారులు పట్టించుకోలేదు. దానం పై కేసు పెట్టారు. ఈ ఘటన తర్వాతా రేవంత్ రెడ్డిపై ప్రజలకు మరితం నమ్మకం పెరిగింది.

## సొంత కుటుంబం, సొంత పార్టీ ఒత్తిళ్లకూ తలొగ్గకపోతేనే ఫలితం

హైడ్రాకు పూర్తి వ్యవస్థ ఇంకా ఏర్పడలేదు. రేవంత్ ఉన్న పట్టుదల ప్రకారం.. హైడ్రాకు ఉన్న విస్తృతి ప్రకారం ప్రత్యేకంగా నిధులు కల్పించడంతో పాటు మూడు వేల మంది అధికారులు, సిబ్బందిని కేటాయించాలన్న ఆలోచనలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఇప్పటికే దీనిపై ఆయన రంగనాథ్‌తో కలిసి కసరత్తు కూడా చేస్తున్నారు. గొప్ప సంకల్పంతో హైడ్రాను ఏర్పాటు చేసిన సిఎం రేవంత్ రెడ్డిపై, ఒత్తిళ్లకు తలొగ్గక నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న కమిషనర్ రంగనాథ్‌లపై సహజంగానే కొన్ని వర్గాల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ట్రాన్స్ ఫర్ అయిపోతారని చాలా మంది బెదిరిస్తున్నారు. అదే సమయంలో హైడ్రా సంస్థ అనతికాలంలోనే కబ్జాకోరులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. ఉస్మాన్ సాగర్ పరిధి బఫర్ జోన్‌లో ఓరో స్పోర్ట్ విలేజీలో గ్రీన్ కో సంస్థ అక్రమంగా నిర్మించిన 20 అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. గ్రీన్ కో కు ఉన్న పలుకుబడి అంతా ఇంతా కాదు. ముఖ్యమంత్రిగా వ్యక్తిగత రాగద్వేషాలకు అతీతంగా హైడ్రాకు సంపూర్ణ అధికారులతో ఎవరిపైనా ఆపేక్ష చూపించకుండా.. తన పని తాను చేసుకునే అవకాశం కల్పిస్తే%ొా% రేవంత్ రెడ్డి పరిపాలనా పరంగా అద్భుతమైన ముందడుగు వేసినట్లే అనుకోవచ్చు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి ఎదుర్కొనే మొదటి సవాల్ రాజకీయ పరమైనదే. పార్టీలు మారి వచ్చిన దానం నాగేందర్, అరికెపూడి గాంధీ లాంటి శాసన సభ్యులు హైడ్రా సంస్థ పని తీరుపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నేతలు ఏకంగా హైడ్రా సంస్థ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆ సంస్థ ను రద్దు చేయమని నేరుగానే డిమాండ్ చేస్తున్నారు. అంతా రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతోందని తెలిసిన తరవాత కూడా వారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే%ొా% తిరుగుబాటుకు సిద్ధమన సంకేతాలు పంపినట్లే. చాలా మంది రాజకీయ నేతలకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారి పార్టీనే. ఎందుకంటే.. వారి పని ఈ అక్రమాలను .. కబ్జాలను కాపాడుకోవడమే. అందుకే అధికార పార్టీ ప్రజాప్రతినిధుల నుండి హైడ్రా సంస్థ తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటుంది. . పరిమితంగా అధికారాలు ఉండడంతో ప్రజా ప్రతినిదులు, కబ్జాకోరుల ఒత్తిడితో హైడ్రా సంస్థ అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి మీదనే ఉంది. హైడ్రా సంస్థకు ప్రత్యేక చట్టం తేవడంతో పాటు ప్రత్యేక అధికారాలు కల్పించడం లేదా స్వయం ప్రతిపత్తి కల్పించినప్పుడే హైడ్రా నిర్భయంగా తమ బాధ్యతలు నిర్వహించగలరు. ఇలా నిధులు, విధులు, పవర్స్ కల్పించడం రేవంత్ రెడ్డి ఎదుర్కోనున్నరెండో సవాల్.దశాబ్దాల తప్పుల్ని ఒక్క సారే సరి చేయడం సాధ్యం కాదు కానీ !నిజానికి దశాబ్దాల పాటు జరిగిన తప్పుల్ని ఇలా బుల్ డోజర్లతో వెళ్లి కరెక్ట్ చేయడం సాధ్యమయ్యే పని కాదు. 44 ఏళ్ల క్రితం చెరువుల్ని ఇప్పుడు మళ్లీ యథాతథ స్థితికి తీసుకు రావాలంటే వేళ ఇళ్లను పడగొట్టాల్సి ఉంటుంది. కొన్ని వేల కుటుంబాలు రోడ్డున పడతాయి. వాటిని అమ్ముకున్న బిల్డర్లు బాగానే ఉంటారు. కొనుక్కున్న వారు మాత్రమే బాధితులు అవుతారు. అందుకే ఈ విషయంలో హైడ్రా వాస్తవిక దృక్పథంతో ముందుకు వెళ్లాల్సి ఉంది. ఎప్పుడే పదిహేను.. ఇరవై ఏళ్ల కిందట కట్టుకుంటే ఇప్పుడు అక్రమ కట్టడాలు అని కూల్చివేస్తమంటే ఎలా అని హైకోర్టుకూడా ప్రశ్నించింది. ఇన్నేళ్ల పాటు ఎవరూ పట్టించుకోకుండా.. ఇప్పుడు ఒక్క సారే వచ్చి కూల్చేస్తామంటే అది న్యాయసమ్మతం కూడా కాదు. అందుకే .. హైడ్రా.. కూల్చివేతల విషయంలో.. చెరువులని కాపాడే విషయంలో ఓ ప్రత్యేకమైన విధానాన్న అమలు చేసుకుని దానికి తగ్గట్లుగా వ్యవహరించాల్సి ఉంది. దళాబ్దాల పాటు చేసిన తప్పుల్ని ఇప్పటికిప్పుడు సరిదిద్దాలనుకోవడం కూడా అసాధారణమే. ఎన్నో అంశాలు ముడిపడి ఉంటాయి. ఈ విషయంలో గత పదేళ్ల కాలాన్ని టార్గెట్ గా పెట్టుకుని.. బఫర్ జోన్లు.. శిఖం భూముల్ని మొత్తం క్లియర్ చేస్తే చాలా వరకూ సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఈ విషయంలో రేవంత్ రెడ్డి కుటుంబీకులు బాధితులు అయినా సరే%ొా% వదిలి పెట్టకుండా ముందుకు సాగితే అనుకున్న లక్ష్యం సిద్ధిస్తుంది.

## ఎన్ని కష్టాలెదురైనా పని పూర్తి చేస్తే హైదరాబాద్ చరిత్రలో రేవంత్‌కు ప్రత్యేక స్థానం !

సాధారణంగా ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలాంటి డ్రైవ్‌లు జరుగుతూ ఉంటాయి. మొదట్లో బుల్ డోజర్లకు చాలా పని పడుతుంది. తర్వాత అందరూ రాజీ పడిపోతారు. రేవంత్ రెడ్డి విషయంలో మాత్రం ప్రజలు అలా అనుకోవడం లేదు. ఆయన హైదరాబాద్‌కు ఏదో చేయాలని తపన పడుతున్నారని గట్టిగా నమ్ముతున్నారు. ఆయన వచ్చే ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేయకపోయినా పర్వాలేదు చెరువులు.. నాలా కబ్జాల నుంచి బయటపడేలా చేసి.. వానొచ్చిన.. వరదొచ్చినా ఏమీ మునగకుండా.. వచ్చిన నీరు వచ్చినట్లుగా కాలువల ద్వారా బయటకు వెళ్లిపోయే మార్గాన్ని సిద్ధం చేస్తే చాలు . ప్రజలు రేవంత్ రెడ్డిని నెత్త మీద పెట్టుకుంటారు. అయితే ఇది చిన్న విషయం కాదు.. ఇంకా చెప్పాలంటే అసాధారణమైన విషయం. రేవంత్ రెడ్డి మిగతా సీఎంల మాదిరిగా కాదని.. ఆసాధారణమైన పనులు చేయగల సీఎం అని.. నిరూపించుకుంటారని ఆశిద్దాం. ఈ క్రమంలో ఆయనకు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవచ్చు.. కానీ ప్రజలు ఆయన చిత్తశుద్ధిని నమ్మినంత కాలం ఆయన వెంటే ఉంటారు. ప్రజలు అంచనా వేసిన దాంట్లో సగం చేసినా ఆయనను%ొా% హైదరాబాద్ పునర్నిర్మాణ నేతగా గుర్తుంచుకుంటార్ను. అందులో సందేహమే ఉండదు.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com